

రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద నిత్యాన్నదాన భవన నిర్మాణానికి కామిశెట్టి నరేష్‌బాబు, రమ్యశ్రీ దంపతులు (బొమ్మూరు) రూ.1,01,116 విరాళం సమర్పించారు.



డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం తూర్పు డెల్టాకు 4,900, మధ్య డెల్టాకు 2,600, పశ్చిమ డెల్టాకు 7,500 క్యూసెక్కుల నీరు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.30 అడుగులకు చేరింది.

అన్నదాన విరాళం



ద్వారకా తిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు మోటుపల్లి రాజు (ఆకివీడు మండలం కుప్పనపూడి) మంగళవారం రూ.1,11,011 విరాళం సమర్పించారు.

న్యూస్‌రీల్

నిత్యాన్నదాన భవన నిర్మాణానికి విరాళాలు



దాతలకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న చైర్మన్ రమేష్‌రాజు

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో నిర్మిస్తున్న నిత్యాన్నదాన భవన నిర్మాణానికి పలువురు భక్తులు విరాళాలు సమర్పించారు. యు.రాజేంద్రప్రసాద్ వర్మ, జానకి లక్ష్మి దంపతులు (విశాఖపట్నం) రూ.25 వేలు, ఎస్.శ్రీనివాస్, జ్యోతి దంపతులు (ఆలమూరు మండలం చింతలూరు) రూ.25 వేలు, ఎం.సత్యనారాయణ, ధనలక్ష్మి దంపతులు (వడలి) రూ.11,146, పి.జోగారావు, మణి దుర్గా భవాని దంపతులు (ఆత్రేయపురం) రూ.10,116, వి.శ్రీనివాసరెడ్డి, స్వాతి దంపతులు (పెనుమంట్ర మండలం వెలగలేరు) రూ.10,116, ఎ.శంకరరావు, శ్రీదేవి దంపతులు (సికింద్రాబాద్) రూ.10 వేల చొప్పున విరాళాలు సమర్పించారని ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. దాతలకు చైర్మన్ చేతుల మీదుగా స్వామి వారి చిత్రపటాలు అందజేశారు.

క్రైం ఏఎస్సై బాలకృష్ణకు ఏపీ సేవా పతకం



మంత్రి రమేష్ నుంచి ఏపీ సేవా పతకం అందుకుంటున్న క్రైం ఏఎస్సై బాలకృష్ణ

అమలాపురం టౌన్: పట్టణానికి చెందిన జిల్లా క్రైం ఏఎస్సై అయితాబత్తుల బాలకృష్ణ ఏపీ సేవా పతకానికి ఎంపికయ్యారు. స్థానిక బాలయోగి స్టేడియంలో మంగళవారం జరిగిన స్వాతంత్ర్య వేడుకల వేదికపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి జోగి రమేష్, కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ శ్రీధర్ చేతుల మీదుగా బాలకృష్ణ పతకం, ప్రశంసా పత్రం అందుకున్నారు.

గోదావరిపై త్వరలో ఐకానిక్ వంతెన

రాజమహేంద్రవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో అఖండ గోదావరిపై రాజమహేంద్రవరం వద్ద మరో నూతన వంతెన నిర్మించనున్నట్టు ఎంపీ మార్గాని భరత్‌రామ్ వెల్లడించారు. నగరంలోని తన కార్యాలయంలో మంగళవారం జరిగిన స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. కొత్త వంతెన డిజైన్ రాజమహేంద్రవరం నగరానికే కాకుండా రాష్ట్రంలోనే ప్రత్యేకంగా ఉండబోతోందని చెప్పారు. విశాఖ – విజయవాడ మధ్య మూడో రైల్వే లైను రానుందని, ఇప్పటికే విజయవాడ – గుంటూరు మధ్య దీని పనులు జరుగుతున్నాయని చెప్పారు. మూడేళ్లుగా మూడో లైను, నూతన వంతెన ప్రతిపాదనలను రైల్వే శాఖకు పంపిస్తూనే ఉన్నామని, దీనిపై ఇటీవలే రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిశామని తెలిపారు. విశాఖ – విజయవాడ మూడో లైన్ ప్రతిపాదనను రైల్వే బోర్డు క్లియర్ చేయడమే కాకుండా, నూతన బ్రిడ్జి ప్రతిపాదనకు కూడా ఆమోదించినట్లు వార్తలొచ్చాయన్నారు. నాలుగో లైన్ ప్రతిపాదన కూడా రైల్వే బోర్డు సమావేశంలో చర్చకు వచ్చినట్టు తెలిసిందన్నారు. గోదావరిపై ఐదో వంతెన ఎక్కడ నిర్మించాలన్న అంశంపై కూడా తాను రైల్వే మంత్రికి వివరించానన్నారు. రోడ్డు కం రైల్వే వంతెన అభివృద్ధి పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని ఎంపీ భరత్ చెప్పారు.

జేఎన్‌టీయూకేలో అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూకేలో త్వరలో అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీకి చర్యలు తీసుకుంటామని ఉప కులపతి డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా వర్సిటీ ఆవరణలో ఎన్‌సీసీ వలంటీర్ల నుంచి మంగళవారం ఆయన గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జెండా వందనం చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ, ఈ ఏడాది బీటెక్‌లో సీఎస్‌ఈ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మెషీన్ లెర్నింగ్ కోర్సులతో పాటు ఎమ్మెస్సీ డేటా సైన్స్, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ కోర్సులు ప్రారంభించామని చెప్పారు. ప్రపంచ స్థాయి విద్యా బోధనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. స్వాతంత్ర్య సమర యోధుల కుటుంబ సభ్యులను వీసీ సత్కరించారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ సుమలత, స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి.. 'పతాక' స్థాయిలో..

- రూ.200 కోట్లతో గోదావరి నదీకోత నివారణ
- 83,885 మందికి ఇళ్ల పట్టాలు
- పలు పథకాలతో వివిధ వర్గాలకు లబ్ధి
- స్వాతంత్ర్య దినోత్సవంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి జోగి రమేష్
- అంబరాన్నంటిన సంబరాలు



జాతీయ జెండా ఎగురవేసి వందనం చేస్తున్న మంత్రి జోగి రమేష్, కలెక్టర్ శుక్లా, ఎస్పీ శ్రీధర్

సాక్షి, అమలాపురం: స్వాతంత్ర్య వేడుకలు అంబరాన్ని తాకాయి. జిల్లా కేంద్రమైన అమలాపురంలోని బాలయోగి స్టేడియంలో మంగళవారం జరిగిన ఈ సంబరాలు అట్టహాసంగా జరిగాయి. జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ జాతీయ జెండాను ఎగురవేశారు. పరేడ్ కమాండర్ విజయ భాస్కర్ ఆధ్వర్యాన పోలీసు దళాలు, ఎన్‌సీసీ విద్యార్థులు కవాతు నిర్వహించారు. లయబద్ధంగా సాగిన బ్యాండ్‌కు అనుగుణంగా పోలీసులు నిర్వహించిన కవాతు ఆకట్టుకుంది. మంత్రి రమేష్‌తో పాటు కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ ఎస్.శ్రీధర్ గౌరవ వందనం స్వీకరించారు. స్వాతంత్ర్య వేడుకలను చూసేందుకు జిల్లా నలుమూలల నుంచీ ప్రజలు తరలివచ్చారు. వేడుకల కోసం ఏర్పాటు చేసిన ప్రధాన వేదిక, పోలీసులు ఏర్పాటు చేసిన పోలీసు గ్రౌండ్ నమూనా ఆహూతులను ఆకట్టుకున్నాయి.

అన్ని రంగాల్లోనూ అభివృద్ధి

ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ జిల్లా ప్రగతిని వివరించారు. జిల్లాల పునర్విభజన ద్వారా పరిపాలన వేగం అందుకుందన్నారు. అట్టడుగు వర్గాల వారికి మెరుగైన సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అందుతాయనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిన్న జిల్లాలు ఏర్పాటు చేశారని తెలిపారు. గడచిన రెండేళ్లలో జిల్లా అన్ని రంగాల్లోనూ అద్భుత ప్రగతి సాధించిందన్నారు. పలు సందర్భాల్లో మౌలిక సదుపాయల కల్పన, సంక్షేమ పథకాల అమలులో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని చెప్పారు. స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తితో ప్రభుత్వం ముందడుగు వేస్తోందన్నారు.

గోదావరి నదీ కోత నివారణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.200 కోట్లు కేటాయించారని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 1,808 ఎకరాల భూమి సేకరించి 701 లే అవుట్లు వేసి 83,885 మందికి ఇళ్ల పట్టాలు అందించామని తెలిపారు. రైతుభరోసా పథకం ద్వారా 1,61,386 మంది రైతుల ఖాతాల్లో రూ.89.92 కోట్లు జమ చేశామన్నారు. ఉచిత పంటల బీమా ద్వారా 2022 సంవత్సరానికి 28,686 మంది ఖాతాల్లో రూ.20.44 కోట్లు జమ చేశామని చెప్పారు. ప్రస్తుత సంవత్సరంలో 54,869 మంది కౌలుదారులకు పంట సాగు హక్కు పత్రాలు అందించామన్నారు. 389 రైతుభరోసా కేంద్రాల ద్వారా రూ.287.42 కోట్ల విలువైన 1.41 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించిందని గుర్తు చేశారు. రబీలో అకాల వర్షాల వల్ల రంగు మారిన 14,427 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసిందన్నారు. కొబ్బరి అభివృద్ధి బోర్డు ద్వారా తోటల పునరుద్ధరణలో భాగంగా ఉద్యాన రైతులకు హెక్టార్‌కు రూ.53,500 ఇస్తున్నామని తెలిపారు. నవరత్నాలు – పేదలందరికీ ఇళ్ల నిర్మాణంలో భాగంగా 24,664 ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన, వైఎస్సార్ పట్టణ గృహ నిర్మాణ పథకం ద్వారా రూ.443.59 లక్షల ఖర్చుతో ఇళ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన, వైఎస్సార్ గ్రామీణ గృహ నిర్మాణ పథకం ద్వారా 9,810 గృహాలకు రూ.176.58 కోట్లు ఖర్చు చేశామని చెప్పారు.

జగనన్న అమ్మ ఒడి పథకం ద్వారా 1,38,833 మంది తల్లుల ఖాతాల్లో రూ.208.24 కోట్లు జమ చేశామని తెలిపారు. జగనన్న గోరుముద్దలో 1,14,833 మంది విద్యార్థులకు నాణ్యమైన భోజనం, జగనన్న విద్యా కానుక అందజేశామని మంత్రి రమేష్ వివరించారు.

ఆకట్టుకున్న శకటాల ప్రదర్శన

స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా వివిధ శాఖలు నిర్వహించిన శకటాల ప్రదర్శన ఆకట్టుకుంది. సుమారు 11 ప్రభుత్వ శకటాలను ప్రదర్శించారు. గృహ నిర్మాణ సంస్థ శకటం ప్రథమ, డీఆర్‌డీఏ శకటం ద్వితీయ, ఉద్యాన శాఖ శకటం తృతీయ స్థానాల్లో నిలిచాయి. వీటితో పాటు వ్యవసాయ, భూ సర్వే, అగ్నిమాపక, విపత్తుల నిర్వహణ, దేవదాయ, ధర్మదాయ శాఖలకు చెందిన శకటాలు సైతం ఆహూతులను ఆకర్షించాయి.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి. దేశమంటే మట్టి కాదోయ్, హర్ ఘర్ తిరంగా, లెజిమ్ కోలాటం, పాడుదామా స్వేచ్ఛా గీతం, రంగీలా, జయహో, లాహిరి లాహిరి, మల్లకంభం వంటి కార్యక్రమాలు ప్రదర్శించిన వివిధ పాఠశాలల విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్, ఎమ్మెల్సీలు బొమ్మి ఇజ్రాయిల్, ఐవీ రావు, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, రాష్ట్ర దృశ్యకళల అకాడమీ చైర్మన్ కుడుపూడి సత్యశైలజ, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, డీఆర్‌ఓ సీహెచ్ సత్తిబాబు, ఆర్‌డీఓలు ఎం.ముక్కంటి, ఎస్ఎస్‌వీబీ వసంతరాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న విద్యార్థుల విన్యాసాలు



అలరించిన విద్యార్థినుల నృత్య ప్రదర్శనలు







ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన గృహ నిర్మాణ, డీఆర్‌డీఏ, ఉద్యాన శాఖల శకటాలు

ఉత్తమ సేవలకు పురస్కారాలు

అమలాపురం రూరల్: జిల్లా వ్యాప్తంగా విశిష్ట సేవలు అందించిన 370 మంది అధికారులు, ఉద్యోగులకు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జోగి రమేష్ ఉత్తమ సేవా పురస్కారాలు ప్రదానం చేశారు. స్థానిక జీఎంసీ బాలయోగి స్టేడియంలో మంగళవారం జరిగిన స్వాతంత్ర వేడుకల్లో ఈ కార్యక్రమం జరిగింది. కలెక్టర్ హిమాన్షు శుక్లా, జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్, జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్, ఎమ్మెల్సీలు బొమ్మి ఇజ్రాయిల్, ఇళ్ల వెంకటేశ్వరరావు, పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా రెవెన్యూ శాఖ నుంచి 12 మంది, పోలీసు శాఖలో 65, ఉద్యాన శాఖ 2, ఆర్‌డబ్ల్యూఎస్ 5, జలవనరుల శాఖ 3, ఆర్‌అండ్‌బీ 5, అగ్నిమాపక శాఖ 2, వ్యవసాయ శాఖ 5, ఏపీ ఈడబ్ల్యూఎస్‌ఐడీసీ 2, పశు సంవర్ధక శాఖ 5, పంచాయతీ శాఖ 30, పౌర సరఫరాల శాఖ 2, డీసీహెచ్‌ఎస్ 4, సమాచార శాఖ నుంచి ఇద్దరితో పాటు ఇంకా వివిధ విభాగాలతో పాటు గోదావరి వరదల్లో సేవలందించిన 30 మంది, జగనన్న సురక్షలో 8, సేవా రంగాల్లో 8 మందికి ప్రశంసా పత్రాలు అందించారు. ప్రశంసా పత్రాలు అందుకున్న వారిలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ఎం.దుర్గారావుదొర, జిల్లా వ్యవసాయ అధికారి ఎ.బోసుబాబు, జిల్లా ఉద్యాన అధికారి బీవీ రమణ తదితరులు కూడా ఉన్నారు.



జిల్లా ఇన్‌చార్జి మంత్రి జోగి రమేష్, కలెక్టర్ హిమాన్షు శుక్లా, జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న ఎస్పీ ఎస్.శ్రీధర్



డ్వామా పీడీ మధుసూదన్



డీఆర్‌డీఏ ఏపీడీ జిలాని



ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కృష్ణారెడ్డి



డీపీఓ కృష్ణకుమారి



డీఆర్‌ఓ సత్తిబాబు



అమలాపురం ఆర్‌డీఓ వసంతరాయుడు



కొత్తపేట ఆర్‌డీఓ ముక్కంటి



జిల్లా బీసీ సంక్షేమ అధికారి తిక్కా వెంకటేశ్వర్లు



పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ ఎస్ సుధాసాగర్



డీపీఆర్‌ఓ మహమ్మద్ విలియత్ అలీ



డీఆర్‌డీఏ పీడీ శివశంకర్ ప్రసాద్



డీసీహెచ్ఎస్ పద్మశ్రీరాణి



సచివాలయాల నోడల్ అధికారి భీమేశ్వరరావు



జిల్లా రవాణా అధికారి అశోక్ ప్రతాప్‌రావు



షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్ తల్లిదండ్రులు కాశీ, రంగమణి దంపతులకు మంత్రి రమేష్, కలెక్టర్ శుక్లా సత్కారం

నారా వారి నాన్చుడు పాలసీ



- నిండా మునుగుతున్న టీడీపీ
- ప్రతి నియోజకవర్గంలోనూ తలనొప్పులే
- రామచంద్రపురం, పి.గన్నవరాలకు తాత్కాలిక ఇన్‌చార్జితో సరి
- గాలిలో గొల్లపల్లి భవితవ్యం
- అమలాపురంలో వీధిన పడిన విభేదాలు
- మండపేటలో వ్యతిరేకత మూటగట్టుకుంటున్న వేగుళ్ల
- తలలు పట్టుకుంటున్న తమ్ముళ్లు
- నేటి నుంచి కోనసీమలో చంద్రబాబు మూడు రోజుల పర్యటన

సాక్షి, అమలాపురం: 'అట్టడుగు నుంచి సమాచారం తెప్పించుకుంటాను. మూడు నాలుగు సర్వేలు చేయిస్తాను. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, ఐవీఆర్ఎస్ సర్వే చేయించి, డేటా విశ్లేషణ చేయడం ద్వారా పార్టీ ఇన్‌చార్జిలను, అభ్యర్థులను నిర్ణయిస్తాను' ఇది టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు తరచూ చెప్పే మాట. కానీ ఆయన మాటలకు చేతలకు పొంతన ఉండటం లేదు. అభ్యర్థులను నిర్ణయించడం అటుంచి కనీసం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిలను సైతం ధైర్యంగా నియమించే స్థితిలో టీడీపీ అధినేత లేరు. ఆయన నాన్చుడు ధోరణి పార్టీ పుట్టి ముంచుతోందని తమ్ముళ్లు తలలు పట్టుకుంటున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో చంద్రబాబు బుధవారం నుంచి మూడు రోజుల పాటు జిల్లాలో పర్యటించనున్నారు. తొలి రోజు మండపేట, గురువారం కొత్తపేట, శుక్రవారం అమలాపురంలో రచ్చబండ, రోడ్డు షోలు, బహిరంగ సభలు నిర్వహించనున్నారు. ఆవిర్భావం నుంచీ పలు ఎన్నికల్లో ఏకపక్ష విజయాలు సొంతం చేసుకున్న జిల్లాలో టీడీపీ ఎదురీతకు సంస్థాగత లోపాలు, ప్రజా విశ్వాసం కోల్పోవడం ప్రధాన కారణం కాగా.. పార్టీ అధినేత నాన్చుడు ధోరణి కూడా దీనికి తోడవుతోందని తమ్ముళ్లు అంటున్నారు.

అన్నిచోట్లా సమస్యలే..

- ఎన్నికల సమయం దగ్గర పడుతున్న తరుణంలో కూడా జిల్లాలోని ఇంచుమించు అన్ని నియోజకవర్గాల్లోనూ టీడీపీలో అంతర్గత కుమ్ములాటలు, అసంతృప్తులు, ఆధిపత్య పోరు కొనసాగుతూనే ఉన్నాయి. రామచంద్రపురం, పి.గన్నవరం నియోజకవర్గాలకైతే దిశానిర్దేశం చేసే నాయకులే లేరు. జిల్లా కేంద్రం అమలాపురంతో పాటు కొత్తపేటలో కూడా నాయకుల మధ్య ఆధిపత్య పోరు సాగుతోంది. ముమ్మిడివరం, రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జిల తలలపై పొత్తుల కత్తులు వేలాడుతున్నాయి.
- గత ఎన్నికల తరువాత నుంచి పి.గన్నవరం నియోజకవర్గంలో పార్టీని నడిపించే నాయకుడే లేకుండా పోయాడు. ప్రస్తుతం టూమెన్ కమిటీ పేరుతో అమలాపురం పార్లమెంటరీ ఇన్‌చార్జి గంటి హరీష్ మాధుర్, జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు పని చేస్తున్నారు. గత ఎన్నికల్లో ఇక్కడి నుంచి నేలపూడి స్టాలిన్‌బాబు పోటీ చేశారు. ఎన్నికలు పూర్తి కాగానే ఆయన పార్టీని వీడారు. తరువాత ఇన్‌చార్జి కోసం పలువురు పేర్లు తెర మీదకు వచ్చినా చెప్పుకునే స్థాయి నాయకులు లేరు. గత్యంతరం లేని పరిస్థితుల్లో హరీష్‌కు అప్పగించారు. రాజకీయ అనుభవం లేకపోవడం.. అటు పార్లమెంటరీ నియోజకవర్గానికి, ఇటు అసెంబ్లీ నియోజకవర్గానికి తిరగాల్సి రావడంతో హరీష్ సైతం సమర్థంగా పని చేయడం లేదు. నామన చురుకుగా ఉండడం లేదు. నియోజకవర్గ ఇన్‌చార్జి నియామకాన్ని చంద్రబాబు నాలుగున్నరేళ్లుగా గాలికి వదిలేయడం క్యాడర్‌ను నిరుత్సాహానికి గురి చేస్తోంది.
- మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పరిస్థితి మరీ దారుణం. పార్టీ రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్నా వచ్చే ఎన్నికల్లో ఆయనకు ఇక్కడి నుంచి టిక్కెట్ దక్కుతుందనే భరోసా లేదు. జనసేనతో పొత్తు ఉంటే రాజోలును ఆ పార్టీకి కేటాయిస్తారని, గొల్లపల్లికి పి.గన్నవరంలో అవకాశం కల్పిస్తారని తొలుత ప్రచారం జరిగింది. కానీ, ఇప్పుడు పి.గన్నవరం ఊసు కూడా లేదు. ఆయన నాయకత్వంపై పార్టీ అధిష్టానానికి నమ్మకం లేదని చెబుతున్నారు. 2014లో సైతం ఆయనకు టీడీపీ అన్యాయమే చేసింది. ఆ ఎన్నికలకు ఏడాది కన్నా ముందే గొల్లపల్లిని అమలాపురం ఎంపీ అభ్యర్థిగా చంద్రబాబు ప్రకటించారు. తీరా ఎన్నికలు వచ్చేసరికి మొండిచేయి చూపించారు.
- ముమ్మిడివరంలో మాజీ ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు(బుచ్చిబాబు)దీ ఇదే పరిస్థితి. పార్టీ టిక్కెట్‌కు మరొకరితో పోటీ లేకున్నా జనసేనతో పొత్తు రూపంలో ఆయనపై కూడా కత్తి వేలాడుతోంది.
- అమలాపురంలో పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, ఇక్కడి నుంచి టిక్కెట్ ఆశిస్తున్న పరమట శ్యామ్ మధ్య విభేదాలు రోడ్డున పడుతున్నాయి. శ్యామ్ వెనుక ఇదే నియోజకవర్గానికి చెందిన పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప వర్గీయులు మద్దతుగా నిలుస్తున్నారు. వీరిద్దరిలో అభ్యర్థి ఎవరనే సందిగ్ధత పార్టీ క్యాడర్‌లో నెలకొని ఉంది. దీనికి తెర దించాల్సిన చంద్రబాబు ఇద్దరినీ పని చేయండని ప్రోత్సహిస్తున్నారు.
- రామచంద్రపురం నియోజకవర్గంలో కూడా ఇదే పరిస్థితి. ఇక్కడ నుంచి గతంలో ప్రాతినిధ్యం వహించిన ప్రస్తుత ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆ పార్టీని వీడిన తర్వాత స్థానికంగా నాయకత్వం లేకుండా పోయింది. శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యాన్ని ఇన్‌చార్జిగా నియమించినా ఆయన ఆ నియోజకవర్గాన్ని పెద్దగా పట్టించుకోవడం లేదు. ఇక్కడ కూడా పార్టీని నడిపించేందుకు సరైన నాయకుడు లేకుండా పోయాడు.
- కొత్తపేటలో మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు టిక్కెట్ పరంగా పోటీ లేకున్నా ఇదే నియోజకవర్గానికి చెందిన రెడ్డి సుబ్రహ్మణ్యంతో ఆధిపత్య పోరు నడుస్తోంది.
- జిల్లాలో టీడీపీ గెలిచిన ఏకైక నియోజకవర్గం మండపేటలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ప్రజా వ్యతిరేకత మూటగట్టుకున్నారు. ఇటు ఇంట, అటు బయట విమర్శల పాలవుతున్నారు. సుదీర్ఘ కాలం ఎమ్మెల్యేగా ఉండటంతో సహజంగానే క్యాడర్‌తో పాటు నియోజకవర్గంలోని పలువురిలో అసంతృప్తి నెలకొంది. ఇటీవల సొంత సామాజికవర్గానికి చెందిన నాయకులు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారంటే వేగుళ్ల మీద సొంత వారిలో ఎంత అసంతృప్తి ఉందో అర్థం చేసుకోవచ్చు.

క్లుప్తంగా

సీనియర్ సిటిజన్లకు డిపాజిట్లపై అదనపు వడ్డీ



కొత్త డిపాజిట్ పథకం బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): డీసీసీబీలో సీనియర్ సిటిజన్లు డిపాజిట్ చేస్తే అదనపు వడ్డీ ఇవ్వనున్నట్లు చైర్మన్ ఆకుల వీర్రాజు తెలిపారు. డీసీసీబీ కార్యాలయంలో కొత్తగా ప్రవేశపెట్టిన గౌతమి రికరింగ్ డిపాజిట్ పథకం, రైతునేస్తం రుణ పథకం బ్యానర్‌ను ఆయన మంగళవారం ఆవిష్కరించారు. గౌతమి రికరింగ్ డిపాజిట్ పథకంలో ఇతరులకు 7.60 శాతం, సీనియర్ సిటిజన్లకు 8.10 శాతం వడ్డీ రేటు ఇవ్వనున్నామని చెప్పారు. ఈ పథకం సెప్టెంబర్ 9వ తేదీ వరకూ మాత్రమే ఉంటుందన్నారు. రైతునేస్తం పథకం ద్వారా ఎకరా భూమి ఉన్న రైతుకు రూ.8 లక్షల రుణం ఇస్తామన్నారు. ఒక రైతుకు గరిష్టంగా రూ.36 లక్షల వరకూ రుణం ఇస్తామని చెప్పారు. దీనిపై వడ్డీ 12 శాతం మాత్రమేనన్నారు. రైతులందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వీర్రాజు కోరారు.

శతాధిక వృద్ధుడి మృతి



కట్టా కృష్ణమూర్తి (పాతచిత్రం)

ముమ్మిడివరం: పట్టణ శివారు అగ్రహారానికి చెందిన శతాధిక వృద్ధుడు కట్టా కృష్ణమూర్తి (101) వృద్ధాప్యంతో మంగళవారం మృతి చెందాడు. ఆయనకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు, 15 మంది మనవలు, మునిమనవలు ఉన్నారు.

కట్నకానుకల చదివింపు పునరుద్ధరణ

అన్నవరం: నిత్య కల్యాణంలో సత్యదేవునికి, అమ్మవారికి భక్తులు సమర్పించే కట్న కానుకలు చదివించే పద్ధతిని పునరుద్ధరించారు. నిత్య కల్యాణం అనంతరం స్వామి, అమ్మవార్లకు భక్తులు కట్న కానుకలు సమర్పించడం చాలా కాలం నుంచే ఉంది. దీనిని ఇటీవల కొంత కాలంగా నిలిపివేశారు. ఈ విషయం తెలుసుకున్న ఈఓ చంద్రశేఖర్ ఆజాద్.. స్వామివారి కల్యాణం అనంతరం భక్తుల కట్న కానుకలు స్వీకరించి, రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు. దీంతో భక్తులు సమర్పించిన కట్న కానుకలను పండితులు రికార్డుల్లో నమోదు చేయడంతో పాటు మైకులో ప్రకటిస్తున్నారు. ఆది, సోమవారాల్లో రూ.1,538, రూ.1,618 కట్న కానుకల రూపంలో వచ్చినట్టు జమ చేశారు. సోమవారం రూ.1,118 కట్న కానుకలు సమర్పించినట్లు వేద పండితులు యనమండ్ర శర్మ, కల్యాణబ్రహ్మ చామర్తి కన్నబాబు మైకులో ప్రకటించారు. స్వామి, అమ్మవారికి భక్తులు సమర్పిస్తున్న వస్త్రాలను కూడా రికార్డుల్లో నమోదు చేస్తున్నారు.

ప్లా'స్టిక్ తీశారు'



దేవస్థానం టోల్‌గేట్ వద్ద వాటర్ బాటిల్స్ తనిఖీ చేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది



భక్తుల వద్ద నుంచి స్వాధీనం చేసుకుని పక్కన పడేసిన ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్

- రత్నగిరిపై పకడ్బందీగా ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ నిషేధం
- టోల్‌గేట్ వద్ద తనిఖీలు
- దేవస్థానం షాపుల్లో నాన్ ప్లాస్టిక్, గాజు వాటర్ బాటిల్స్ విక్రయం

అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో అధికారులు ప్లాస్టిక్‌పై కన్నెర్ర చేశారు. ముందుగా ఇచ్చిన ఆదేశాల ప్రకారం ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్‌ను మంగళవారం నుంచి నిషేధించారు. దీనిని పక్కాగా అమలు చేయడంలో భాగంగా కొండ దిగువన టోల్‌గేట్ వద్ద, మెట్ల దారిలోను భక్తుల లగేజీలు తనిఖీ చేసి, ప్లాస్టిక్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ నిషేధం గురించి తెలియని పలువురు భక్తులు ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ తీసుకువచ్చారు. వాటిని టోల్‌గేట్ వద్ద, మెట్ల మార్గంలోను దేవస్థానం సెక్యూరిటీ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. ఈవిధంగా సుమారు వెయ్యి వాటర్ బాటిల్స్‌ను పక్కన పడేశారు. వీటిని కిన్లే కంపెనీ యంత్రాల్లో పొడి చేయించి, తిరిగి ఆ కంపెనీకే విక్రయించనున్నారు. రత్నగిరిపై గాజు, రాగి, స్టీల్, నాన్ ప్లాస్టిక్ బయో ఎలైట్ వాటర్ బాటిల్స్ మాత్రమే వినియోగించాలని భక్తులకు సూచించారు. దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ ఆదేశాల మేరకు దేవస్థానంలోని అన్ని ఫ్యాన్సీ, కూల్‌డ్రింక్స్ షాపుల్లో ప్లాస్టిక్ బాటిల్స్‌ను ఉపసంహరించారు. వాటి స్థానంలో దేవస్థానం అనుమతించిన గాజు వాటర్ బాటిల్స్, నాన్ ప్లాస్టిక్ బయో ఎలైట్ వాటర్ బాటిల్స్ మాత్రమే విక్రయించారు. అయితే, తొలి రోజున గాజు, బయో ఎలైట్ వాటర్ బాటిల్స్ విక్రయాలు ఆశించిన స్థాయిలో లేవని రత్నగిరిపై ప్రైవేటు వ్యాపారులు తెలిపారు. గతంతో పోల్చితే 20 శాతం కూడా అమ్మకాలు జరగలేదని చెప్పారు. ప్లాస్టిక్ వాటర్ బాటిల్ రూ.20 కాగా, గాజు వాటర్ బాటిల్ లీటర్ రూ.60, బయో ఎలైట్ వాటర్ బాటిల్ రూ.40కి విక్రయించారు. ఖాళీ గాజు బాటిల్ తిరిగి ఇస్తే రూ.40 తిరిగి ఇస్తున్నారు. బయో ఎలైట్ వాటర్ బాటిల్‌ను మాత్రం భక్తులు తీసుకు వెళ్లే అవకాశం ఉంది. దీనిని మూడు నెలల వరకూ వాడుకోవచ్చు.



షాపులో విక్రయిస్తున్న గాజు వాటర్ బాటిల్స్

వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశాం



ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ నిషేధించినప్పటికీ భక్తులకు ఇబ్బంది లేకుండా దేవస్థానంలో ఎనిమిది చోట్ల వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశాం. అక్కడ గ్లాసులు కూడా ఉంచాం. అలాగే, నాన్ ప్లాస్టిక్, గాజు సీసాలు తెచ్చుకుని భక్తులు నీటిని పట్టుకోవచ్చు. దేవస్థానం షాపుల్లో గాజు, నాన్ ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ అమ్మకానికి ఉంచాం. తొలి రోజు కొత్తగా ఉన్నా భక్తులు ఈ పద్ధతి అలవాటు చేసుకుని పర్యావరణ పరిరక్షణకు సహకరించాలి.

– ఎస్ఎస్ చంద్రశేఖర్ ఆజాద్, ఈఓ, అన్నవరం దేవస్థానం

మువ్వన్నెల పతాకమా..

అందుకో నా వందనం



జాతీయ పతాకానికి నేతాజీ సెల్యూట్



ఫొటో తీసిన ట్యాంకు శ్రీను

దేశ స్వాతంత్య్రోద్యమ నేతల్లోని అగ్రగణ్యుల్లో ఒకరు.. ఆజాద్ హింద్ ఫౌజ్ దళపతి.. నేతాజీ సుభాష్‌చంద్రబోస్. ద్రాక్షారామ ప్రధాన రహదారిపై ఆయన విగ్రహం సైనిక దుస్తుల్లో ఠీవీగా సెల్యూట్ చేస్తూ నిలబడి ఉంటుంది. బోసు బొమ్మ సెంటర్‌గా పేరొందిన ఆ ప్రాంతంలో నేతాజీ విగ్రహం ఎదురుగా ద్రాక్షారామ పంచాయతీ కార్యాలయం ఆధ్వర్యాన మంగళవారం జాతీయ జెండా ఎగురవేశారు. ఆ జెండాకు నేతాజీ సెల్యూట్ చేస్తున్నట్టుగా విగ్రహం వెనుక నుంచి పంచాయతీలో ట్యాంక్ వాచర్‌గా పని చేస్తున్న ఆకుల శ్రీనివాసరావు (ట్యాంకు శ్రీను) ఫొటో తీశారు. ఇది మంగళవారం బాగా వైరల్ అయ్యింది. ఈ ఫొటోను పలువురు తమ వాట్సాప్ స్టేటస్‌గా పెట్టుకున్నారు.

– రామచంద్రపురం రూరల్

ప్రతిభకు ప్రోత్సాహం..

ఉపకార వేతనం

- ఎన్ఎంఎంఎస్ పరీక్షకు నోటిఫికేషన్ విడుదల
- ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులకే అవకాశం
- ఎంపికైన వారికి నాలుగేళ్ల పాటు స్కాలర్‌షిప్
- దరఖాస్తుకు వచ్చే నెల 15 వరకూ గడువు



8వ తరగతి విద్యార్థులు

రాయవరం: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసి, వారికి ఉపకార వేతనాలు అందించేందుకు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ సర్టిఫికెట్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు నోటిఫికేషన్ ఇటీవల విడుదలైంది. ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విషయం తెలిసిందే. దీని ద్వారా ఎనిమిదో తరగతి విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహించి, అర్హత పొందిన వారికి తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకూ ఏడాదికి రూ.12 వేల చొప్పున నాలుగేళ్ల పాటు ఉపకార వేతనం అందిస్తున్నారు. ఇది పేద విద్యార్థులకు విద్యాపరంగా భరోసానిస్తోంది.

పేద విద్యార్థులకు భరోసా

కేంద్ర మానవ వనరుల శాఖ ఆధ్వర్యాన ఎన్ఎంఎంఎస్‌ను 2008–09 విద్యా సంవత్సరంలో ప్రవేశపెట్టారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల సంచాలకుల ఆధ్వర్యాన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని ఆదర్శ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే ఎన్ఎంఎంఎస్ ప్రవేశ పరీక్షకు అర్హులు. ఎంపికైన విద్యార్థుల బ్యాంకు ఖాతాలకు స్కాలర్‌షిప్ నేరుగా జమ చేస్తారు. పదో తరగతి ఉత్తీర్ణత అనంతరం ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్మీడియెట్ చదివిన వారికి మాత్రమే స్కాలర్‌షిప్ కొనసాగిస్తారు. ట్రిపుల్ ఐటీ, పాలిటెక్నిక్ కళాశాలల్లో చదివే వారికి స్కాలర్‌షిప్ కొనసాగింపు ఉండదు. ఏటా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి వందలాది మంది ఎన్ఎంఎంఎస్ ఉపకార వేతనానికి ఎంపికవుతున్నారు. ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతోంది. 2022–23 విద్యా సంవత్సరానికి ఈ ఏడాది ఫిబ్రవరి 5న జరిగిన ప్రవేశ పరీక్షలో ఉమ్మడి జిల్లా నుంచి 9,498 మంది విద్యార్థులు పరీక్ష రాశారు.

పరీక్షా విధానమిదీ..

ఆబ్జెక్టివ్ విధానంలో 180 మార్కులకు ప్రవేశ పరీక్ష ఉంటుంది. 90 మార్కులకు రీజనింగ్, జనరల్ నాలెడ్జ్, మెంటల్ ఎబిలిటీ, జనరల్ ఇంగ్లిష్ ఉంటాయి. మరో 90 మార్కులకు 7, 8 తరగతులకు చెందిన గణితం, సైన్స్, సాంఘిక శాస్త్రం పాఠ్యాంశాలపై ప్రశ్నలుంటాయి. పరీక్ష రాసేందుకు మూడు గంటల సమయం కేటాయిస్తారు. ఉపకార వేతనానికి జిల్లా ప్రాతిపదికగా విద్యార్థులను ఎంపిక చేస్తారు.

దరఖాస్తు చేసుకోవాలిలా..

విద్యార్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.3.50 లక్షల లోపు ఉండాలి. జనరల్, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీలు రూ.50 చొప్పున పరీక్ష రుసుం చెల్లించాలి. ఆన్‌లైన్ దరఖాస్తుకు వచ్చే నెల 15 చివరి తేదీ. పరీక్ష రుసుం చెల్లించేందుకు వచ్చే నెల 16 చివరి తేదీ. ప్రధానోపాధ్యాయులు ప్రింటెడ్ నామినల్ రోల్స్, ధ్రువపత్రాలను సంబంధిత జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సమర్పించడానికి వచ్చే నెల 19 చివరి తేదీ. వివరాలకు ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ లేదా సంబంధిత జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సంప్రదించాలి.

అవగాహన కల్పించాలి



ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ అర్హత పరీక్ష ఒక వరం. ప్రతి ఒక్కరూ పరీక్ష రాసే విధంగా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు అవగాహన కల్పించాలి. ఇప్పటి నుంచే పరీక్ష రాసే విద్యార్థులకు ఓరియెంటేషన్ తరగతులు నిర్వహించాలి. అధిక సంఖ్యలో విద్యార్థులు ఎంపికయ్యేలా కోచింగ్ ఇవ్వాలి.

– జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్యా శాఖ, కాకినాడ



కాట్రేనికోన మండలం కుండలేశ్వరంలో జాతీయ పతాక, ముచ్వన్నెల పూల అలంకరణలో కుండలేశ్వరస్వామి



అమలాపురం గోఖలే సెంటర్‌లోని కనకదుర్గ ఆలయంలో జాతీయ జెండా రంగుల్లోని వస్త్రాలతో దర్శనమిస్తున్న అమ్మవారు



అమలాపురం శ్రీదేవి అమ్మవారి ఆలయంలో స్వాతంత్య్ర స్ఫూర్తిని నింపేలా త్రివర్ణ పతకాల అలంకరణ

భారత్‌మాతా కీ జై

తెల్లవారి దాస్య శృంఖలాలను తెంచుకుని.. భరత భూమి స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్న అపురూప సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ.. అమర వీరుల త్యాగ నిరతిని స్మరిస్తూ.. దేశ ఘనతను చాటి చెబుతూ.. స్వాతంత్య్ర దినోత్సవాన్ని మంగళవారం ఊరూవాడా ఉత్సాహంగా నిర్వహించుకున్నారు. భారతదేశ సార్వభౌమత్వాన్ని చాటి చెప్పేలా.. ముచ్వన్నెల పతాక నింగి వీధుల్లో సమున్నతంగా రెపరెపలాడింది. బడులు, గుడులు, ఇళ్లు, కార్యాలయాలు, వాహనాలు.. ఇలా ప్రతిచోటా త్రివర్ణ పతాకాలతో పలువురు సందడి చేశారు. భారీ జాతీయ పతాకాలతో ప్రదర్శనలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



యానాంలో జరిగిన వేడుకల్లో అలరించిన విద్యార్థినుల విన్యాసాలు



కాకినాడలోని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) వద్ద జాతీయ జెండాను ఎగుర వేస్తున్న చైర్మన్ ఆకుల వీర్రాజు



అమలాపురంలో వెయ్యి అడుగుల త్రివర్ణ పతాకంతో సర్ సీవీ రామన్ స్కూలు విద్యార్థుల ప్రదర్శన

అగ్నిప్రమాదంలో రూ.2 లక్షల ఆస్తి నష్టం

అంబాజీపేట: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా గంగలకుర్రు పంచాయతీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో రూ.2 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. పంచాయతీ సిబ్బంది, స్థానికుల కథనం ప్రకారం.. పంచాయతీ కార్యాలయం గదిలో ఉంచిన బ్లీచింగ్, ముగ్గుల నుంచి మంటలు, పొగ రావడాన్ని పంచాయతీ సిబ్బంది గమనించి పెద్దగా కేకలు వేశారు. అప్రమత్తమైన స్థానికులు మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో గదిలో నిల్వ ఉంచిన రూ.75 వేల విలువైన బ్లీచింగ్, రూ.1.15 లక్షల విలువైన ముగ్గు, రూ.10 వేల విలువైన ఇతర వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. అమలాపురం అగ్నిమాపక అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు.

వ్రతం టిక్కెట్లపై పురోహితుల పారితోషికం ముద్రణ

అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో వ్రత పురోహితులకు 40 శాతం కమీషన్ ఇస్తున్నట్టు వ్రతం టిక్కెట్లపై ముద్రిస్తున్నారు. ఇప్పటి వరకూ వ్రత మండపాల్లో మాత్రమే ఈ విధమైన బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే వ్రత పురోహితులు కానుకలు డిమాండ్ చేస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో పాటు భక్తుల ఫిర్యాదు మేరకు ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ రెండు వారాల వ్యవధిలో ఇద్దరు పురోహితులను సస్పెండ్ చేశారు. భక్తులను పురోహితులు కానుకలు డిమాండ్ చేయకుండా ఉండేందుకుగాను టిక్కెట్లపై వారికి ఇస్తున్న పారితోషకం మొత్తాన్ని ముద్రిస్తున్నారు.

సస్యరక్షణలో తగదు నిర్లక్ష్యం

- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న నిపుణులు
- మందుల పిచికారీలో అప్రమత్తత అవసరం



పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతులు

మండపేట: పురుగు మందుల పిచికారీలో అవగాహన లేమి వ్యవసాయ కూలీలు, రైతులను అస్వస్థతకు గురి చేస్తుంది. ఒక్కోసారి పరిస్థితి విషమించి ప్రాణాలను హరిస్తోంది. సస్యరక్షణ చర్యల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వలన పలువురు రైతులు మృత్యువాత పడగా మరెందరో అనారోగ్యాలకు గురయ్యారు. మందుల పిచికారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయాధికారులు ఇలా సూచిస్తున్నారు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా 5,42,000 ఎకరాల్లో రైతులు ఖరీఫ్ సాగు చేస్తున్నారు. దాదాపు నాట్లు పూర్తి కాగా శివారు ప్రాంతాల్లో తుది దశలో ఉన్నాయి. ముందుగా నాట్లు వేసిన పొలాల్లో పంట తెగుళ్లు ఆశించకుండా రైతులు సస్యరక్షణ చర్యలు చేపడుతున్నారు. పురుగు మందుల వినియోగంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం రైతులకు ప్రాణాంతకమవుతుందని, పలు రోగాల బారిన పడే ప్రమాదముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పురుగు మందులు పిచికారీ చేస్తూ గతంలో వ్యవసాయ కూలీలు, రైతులు అనారోగ్యం పాలవడం, మృత్యువాత పడిన సంఘటనలు ఉన్నాయి. మందుల దుష్పలితాలతో చాలామంది పలు దీర్ఘకాలిక రోగాలతోనూ బాధపడుతున్నారు.

ఈ జాగ్రత్తలు పాటించాలి

- ముందుగా పొలంలో పురుగుల తీవ్రతను అంచనా వేయాలి. పురుగుల సంఖ్య అధికంగా ఉండి పంటకు నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడుతున్నప్పుడు మందు పిచికారీ చేయాలి.
- మిత్ర పురుగులు తగిన సంఖ్యలో ఉన్నప్పుడు మందులు వాడాల్సిన అవసరం ఉండదు.
- పంటను ఆశించింది పురుగులా లేక తెగులా ముందుగా గుర్తించాలి. రైతులకు తెలియకపోతే దుబ్బులు లేదా మొక్కలను తీసుకువెళ్లి వ్యవసాయ అధికారులకు చూపించాలి.
- మందు డబ్బాలపై ఉండే సూచనలను రైతులు తప్పనిసరిగా గమనించి ఆ మేరకు జాగ్రత్తలు తీసుకోవాలి.
- వ్యవసాయ అధికారులు సిఫారసు చేసిన మందును నిర్ణీత మోతాదులో మాత్రమే వినియోగించాలి.
- పురుగు మందుతో కలుపు మందును కలిపి పిచికారీ చేయకూడదు.
- పిచికారీకి ఉపయోగించే స్ప్రేయర్లు, పరికరాలు సరిగా ఉన్నాయో లేదో చూసుకోవాలి. మందును బయటకు పంపే విధానం, ఎంత మందు ద్రావణం మొక్కలపై పడుతుందో ముందుగా గమనించాలి.
- సరిగా పనిచేయని, కారుతూ ఉండే స్ప్రేయర్లను వినియోగించకూడదు.
- పురుగు మందు డబ్బా మూతను నోటితో తీయకూడదు. మందు ద్రావణాన్ని చేతులతో కలపకూడదు.
- పవర్ స్ప్రేయర్ నాజిల్‌ను పెద్దదిగా చేయరాదు, పిచికారీ సన్నగా తుంపరలా పడేలా చూడాలి.
- చేతులకు గ్లౌజులు, ముక్కుకు మాస్క్, కళ్లజోడు తప్పనిసరిగా ధరించాలి.
- గాలి వాలుకు ఎదురుగా పిచికారీ చేయకూడదు.
- పైరు పెద్దగా ఉన్నప్పుడు చేతిపంపుతో పిచికారీ చేయకూడదు. పవర్ స్ప్రేయర్ వాడాలి.
- పిచికారీ చేసేటప్పుడు తినడం, తాగడం, పొగ తాగడం, కళ్లు నలుపుకోవడం, నోటిలో వేళ్లు పెట్టుకోవడం వంటివి చేయకూడదు.
- గాయాలైన చేతులతో మందులను తాకరాదు.
- పిచికారీ పూర్తయిన వెంటనే స్నానం చేయాలి.
- పిచికారీ చేసేందుకు ధరించిన దుస్తులను ఇతర దుస్తులతో కలిపి ఉతకరాదు.
- మందు డబ్బాలను చిన్నపిల్లలకు అందుబాటులో ఉంచకూడదు.
- ఖాళీ డబ్బాలను ఇంటి అవసరాలకు వాడకూడదు. వాటిని గొయ్యి తీసి పాతిపెట్టాలి.

జాగ్రత్తలు తీసుకోవాలి



అవసరం మేరకే రైతులు ఎరువులు, పురుగు మందులు వినియోగించాలి. మొదటి 45 రోజులు పైరుకు ఏ నష్టం కలిగినా పూడ్చుకునే సామర్థ్యాన్ని మొక్క కలిగి ఉంటుంది. అవసరం లేకుండా పురుగు మందు పిచికారీ వలన మిత్ర పురుగులకు నష్టం కలుగుతుంది. వ్యవసాయాధికారుల సూచన మేరకు తగిన జాగ్రత్తలు తీసుకుని సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

– కె.ఏసుబాబు, వ్యవసాయాధికారి, మండపేట